తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
27-03-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 60
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

## పెట్రోల్ కొరత భయం... బంకుల వద్ద క్యూ లైన్లు

- పెట్రోల్ స్టాక్ ఉన్న నో స్టాక్ బోర్డ్
- పెట్రోల్ ఉన్నా పోయడం లేదంటూ వాహనదారుల ఆందోళన

గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో పలు పెట్రోల్ బంకుల వద్ద బుధవారం వాహనదారులు భారీగా బారులు తీశారు. పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందన్న వదంతులతో ప్రజలు ముందస్తు జాగ్రత్తగా ఇంధనం నింపించుకునేందుకు పరుగులు తీయడంతో బంకుల వద్ద క్యూ లైన్లు కనిపించాయి. ప్రత్యేకంగా బొంతపల్లి పారిశ్రామిక వాడలోని హెచ్ పి పెట్రోల్ పంప్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. బంకులో పెట్రోల్ అందుబాటులో ఉన్నప్పటికీ వినియోగదారులకు ఇంధనం పోయడం లేదని ఆరోపిస్తూ ద్విచక్ర వాహనదారులు వాపోయారు.



6





- 13మంది ప్రయాణికుల సజీవ దహనం

## మార్కాపురం వద్ద ఘోర

# బస్సు ప్రమాదం

- టిప్పర్‌ను ఢీకొని మంటల్లో దగ్ధం
- 13మంది ప్రయాణికుల సజీవ దహనం
- పలువురికి తీవ్ర గాయాలు

2

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతోపాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు.

### బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

- ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్‌కు ఆదేశం

2

### మార్కాపురం రోడ్డు ప్రమాదంపై ప్రధాని సంతాపం

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు
- గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా

## బకాయిల వల్ల హాస్పిటల్స్ మూత వట్టిదే

ఆరోగ్యశ్రీ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం
ఈరోజునాటి బకాయిలు రూ.727 కోట్లే
బీఆర్ఎస్ బకాయిలు మోస్తూనే పరిమితి పెంచాం
టీచింగ్ హాస్పిటల్స్‌కు ఆరోగ్యశ్రీ రోగులు
అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

2



### ఎంఎంటీఎస్.. సమయ పాలన పాటించాలి

స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి, స్టేషన్లకు మినీ బస్సులపై పరిశీలన: సీఎం రేవంత్ రెడ్డి

2

### చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం

ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీ ధరన్‌తో సీఎం సమీక్ష

2

## 2నుంచి ఇంటిగ్రేటెడ్ భూభారతి

- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్ నెంబర్
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

3



## భద్రాచలం అభివృద్ధికి రూ.586 కోట్ల నిధులు

- మొదటి దశలో రూ.351 కోట్లతో పనులు ప్రారంభం
- నేటి కళ్యాణోత్సవానికి హాజరవుతున్న సిఎం రేవంత్
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

2





## రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

- దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు, 68,150 మందికి ఉపాధి: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:
గత రెండు దఫాల (2024, 2025) దావోస్ పర్యటనల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 44 ఎంవోయూలను వివిధ కంపెనీలతో కుదుర్చుకుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించారు.

మిగతా 3వ పేజీలో..



### తెరుచుకున్న హోర్ముజ్ జలసంధి

- సరకు రవాణాకు ఇరాన్ అనుమతి

3



### వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో పురుగుల భోజనం

- ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధింపు

3

### ఇంధన వినియోగదారులకు షాక్

పెట్రో, డీజిల్ ధరలు పెంచిన నయారా

3



## సభ చర్చలు తప్పించేందుకే క్రీడా పోటీలు

- కేటీఆర్ విమర్శ

హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:
అసెంబ్లీలో కీలక అంశాలపై చర్చను పక్కన పెట్టేందుకే ప్రభుత్వం ఆటల పోటీలకు తెర తీస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రేవంత్ సర్కార్ సభను సమర్థంగా నడపలేకనే క్రీడా పోటీల ఎత్తుగడ వేసిందని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు కీలక పద్దులపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు

మిగతా 3వ పేజీలో..

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి: తలసాని



- బీసీ సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

3



## ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల కావడం లేదు: హరీశ్‌రావు

హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:
ఆరోగ్యశ్రీ బిల్లులను గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, నిధులు విడుదల కావడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ పలు అంశాలను ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.5 లక్షలు అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 లక్షలు అందిస్తామని చెప్పిందని తెలిపారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన తర్వాత రెండున్నర సంవత్సరాల్లో కేవలం 496 మంది మాత్రమే లబ్ధి పొందారని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులు

మిగతా 3వ పేజీలో..

# ఎంఎంటీఎస్.. సమయ పాలన పాటించాలి

- స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి, స్టేషన్లకు మినీ బస్సులపై పరిశీలన: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:**

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల సంఖ్య తగ్గుతున్న విషయంపై సీఎం ఆరా తీశారు. శాసనమండలి హాల్‌లో గురువారం ఎంఎంటీఎస్ సర్వీసులపై సమీక్ష నిర్వహించారు.

కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లే అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపల భాగంలో ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో అక్కడికి చేరుకునేందుకు మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, మెరుగైన సౌకర్యాలు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపు, ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతుల మెరుగుదలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం

- ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సీఎం సమీక్ష

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:**

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికీ నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో రాష్ట్ర శాసనమండలి హాల్‌లో గురువారం భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.

రాష్ట్రంలో 0-10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం, విద్యాభ్యాస స్థాయి సామర్థ్యలోపాలకు సంబంధించిన పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థుల భావి జీవితంపై పడే ప్రభావాన్ని వివరించారు. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.

ఆ అంశాలపై ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందించేందుకు అదనంగా మరో వ్యక్తిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందించేందుకు 'పోషణ సఖి' పేరుతో మరో వ్యక్తిని నియమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

కార్తీక్ మురళీధరన్ సూచించిన అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌లలో ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆయనతో సమన్వయం చేసుకుని ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని సూచించారు.

సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బకాయిల వల్ల హాస్పిటల్స్ మూత వట్టిదే

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:**



రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిల వల్ల ప్రైవేటు హాస్పిటల్స్ మూతపడుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన గురువారం మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ఆరోగ్యశ్రీ బకాయిలు మోస్తూనే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. 2023 డిసెంబర్ 7 నాటికి రూ.627 కోట్లు పెండింగ్ బకాయిలుగా తమకు భారం అయిందన్నారు. అప్పటినుంచి ఈ రోజు వరకు రూ.2408 కోట్లను ఆరోగ్యశ్రీ కోసం చెల్లించామని, ఇందులో ప్రభుత్వ హాస్పిటల్స్‌కు రూ.927 కోట్లు, ప్రైవేటు హాస్పిటల్స్‌కు రూ.1480 కోట్లు చెల్లించామని, ఈ రోజు వరకు ఉన్న బకాయిలు రూ.727 కోట్లు మాత్రమేనని వివరించారు. ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయని, గత ప్రభుత్వం ఇచ్చిన బకాయిలే పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే రోగుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు బకాయిలు చాలా తక్కువగా ఉన్నాయంటూ ఆరోగ్యశ్రీ చెల్లింపులపై అపోహలు కల్పిస్తున్నారని విమర్శించారు. కాగా, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల విషయంలో గతంలో అనేక అవకతవకలు జరిగాయని, కొంతమంది ఈ నిధిని దుర్వినియోగం చేశారని, కేసులు కూడా పెట్టారని, తమ ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. దీని వల్ల అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందని, ఇప్పటివరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2046 కోట్లT ఇచ్చామని, ఆరోగ్యశ్రీ కోసం రూ.2400 కోట్ల ఖర్చు చేశామని, పేదల వైద్యం కోసం రూ.4500 కోట్లను తమ ప్రభుత్వం ఇచ్చిందని వివరించారు. రాష్ట్రంలో 35 మెడికల్ కాలేజీలు ఉండగా టీచింగ్ కాలేజీలకు రోగులు రావడం లేదని తెలిపారు. పేదలు వైద్యం కోసం వెళ్లే దగ్గర సరైన డాక్టర్లు లేరు.. అందువల్ల ఆరోగ్యశ్రీ రోగులను టీచింగ్ కాలేజీలకు పంపించే ఆలోచన చేస్తున్నామని ఆయన చెప్పారు. ఆరోగ్యశ్రీతోపాటు సీఎం రిలీఫ్ ఫండ్‌ను వీటికి ఇస్తామని, దీనివల్ల ఈ హాస్పిటల్స్ నిర్వహణ మెరుగుపడుతుందని, వీటి నిర్వహణను గ్రూప్1 అధికారికి ఇవ్వాలని అనుకుంటున్నామని చెప్పారు. కులగణనలో భాగంగా చేసిన జనగణన ఆధారంగా కోటీ 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా ఇవ్వబోతున్నామని, దీని వల్ల ప్రతి కుటుంబానికి ధీమా కల్పించబోతున్నామని తెలిపారు. మన వాళ్లు వేల మంది డాక్టర్లు విదేశాల్లో పనిచేస్తున్నారని, వారి కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ తయారు చేస్తున్నామని, మన ప్రాంతానికి వాళ్లు వచ్చినప్పుడు ఇక్కడ హాస్పిటల్స్‌లో సేవలు అందించడానికి వెబ్‌సైట్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఈ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వరంగల్, అల్వాల్, ఎల్‌బీ నగర్, సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్స్‌ను స్పెషలైజేషన్ హాస్పిటల్స్‌గా మారుస్తున్నామని, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇచ్చే నిధులను వీటికి కేటాయిస్తామని సీఎం చెప్పారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3000 కోట్లతో ఉస్మానియా కొత్త హాస్పిటల్ నిర్మిస్తున్నామని, అదనంగా 10 వేల పడకలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, టిమ్స్ పనులు వేగంగా చేస్తున్నామని, గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ వస్తున్నామని చెప్పారు. దామోదర్ రాజనర్సింహ ఇంజనీర్ అయినప్పటికీ సోషల్ డాక్టర్.. ఆయనకు పేదల కష్టాలపై సంపూర్ణమైన అవగాహన ఉంది.. వైద్యంలో నిరంతరం కొత్త సవాళ్లు ఎదురవుతాయి.. వైద్య ఆరోగ్య శాఖ ఒక సవాల్ లాంటిది. భవిష్యత్తులో అనేక సంస్కరణలు తీసుకురాబోతున్నాం.. సభ్యులు ఇచ్చే సలహాలను స్వీకరిస్తామని అన్నారు. విద్య, వైద్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలు.. విద్య అందుబాటులో ఉన్నా నాణ్యమైన విద్య లేదు.. పేదల విద్య, వైద్యం విషయంలో ఒక్క రూపాయి కూడా కోత విధించం.. అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టం చేశారు.

# భద్రాచలం అభివృద్ధికి రూ.586 కోట్ల నిధులు

- మొదటి దశలో రూ.351 కోట్లతో పనులు ప్రారంభం
- నేటి కళ్యాణోత్సవానికి హాజరవుతున్న సిఎం రేవంత్
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

**భద్రాచలం, సిరి న్యూస్ మార్చి 26:**



శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం శుక్రవారం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతోపాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా శుక్రవారం స్వామివారి కళ్యాణం జరగనుండగా అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.శ్రీ సీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పిస్తారని తెలిపారు. ఆయనకు ప్రజల తరపున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

**భద్రాద్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం**

భక్త రామదాసు నిర్మించిన భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానం "దక్షిణ అయోధ్య"గా ప్రసిద్ధి చెందినదని, ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు.భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు విచ్చేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, వీఐపీలు, వివిఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్వామివారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధితోపాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రహదారులు, రైల్వే, నదీ మార్గాల అభివృద్ధిపై చర్యలు తీసుకుంటున్నామని, అమరావతి-జగదల్పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్‌ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం మిథిలా స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# మార్కాపురం వద్ద ఘోర బస్సు ప్రమాదం

**మార్కాపురం, మార్చి 26:**



ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతోపాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి.నరేంద్ర (25), నల్లగొండ్ల, టి.చందన (21), నల్లగొండ్ల, టి.చందు (6), నల్లగొండ్ల, కె.ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి.గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు ,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోని నిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.



# మార్కాపురం రోడ్డు ప్రమాదంపై ప్రధాని సంతాపం

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు,
- గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా

**న్యూఢిల్లీ, సిరి న్యూస్ మార్చి 26:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్కాపురం జిల్లాలో రాయవరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ప్రమాదంలో 13 మంది మృతిచెందిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఇది అత్యంత విషాదకరమైన ఘటనగా అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మార్కాపురం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి పామూరు వైపు వెళ్తున్న తెలంగాణకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు రాయవరం సమీపంలోని పలకల క్వారీల వద్ద కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 13 మంది అక్కడికక్కడే మృతిచెందగా, మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించినట్లు వెల్లడించారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్‌లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

# బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

- ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్‌కు ఆదేశం

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:**

మార్కాపురం బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పలువురు మృతిచెందడం, కొందరికి తీవ్ర గాయాలవడంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏపీ అధికారులతో మాట్లాడి మృతిచెందిన, గాయపడిన వారి పూర్తి వివరాలు సేకరించాలని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం సహాయం అందేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఏపీ సీఎస్‌తో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు.

**ప్రమాదం కలచివేసింది : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



ఏపీలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాను. ప్రైవేట్ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ప్రయాణికులు సజీవ దహనం కావడం తీవ్రంగా కలచివేసిందని కేంద్ర మంత్రి జి,కిషన్‌రెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని,□ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందించాలని, బాధిత కుటుంబాలను అన్ని విధాలా

**అత్యంత విషాదకరం : కేంద్ర మంత్రి బండి సంజ**

ఈ ప్రమాదం అత్యంత విషాదకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 ఎక్స్‌గ్రేషియా పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుండి ఇవ్వనున్నట్లు తెలిపారు.

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి**

మార్కాపురం బస్సు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. మార్కాపురం ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 15 మంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా చూడాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలన్నారు. ప్రైవేట్ వాహనాల భద్రత, రవాణా నిబంధనల అమలుపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘోర కలి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**అత్యంత విషాదకరం : బీజేపీ పక్ష నేత ఏలేటి**

మార్కాపురం ప్రమాదంలో 13 మంది మరణం అత్యంత విషాదకరమని బీజేపీ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వరరెడ్డి అన్నారు. 13 మంది మరణించడం, 22 మందికి గాయపడడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కుండా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రైవేట్ వాహనాల భద్రత, రవాణా నిబంధనలను పక్కాగా అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు.

# సభ చర్చలు తప్పించేందుకే క్రీడా పోటీలు: కేటీఆర్ విమర్శ



మొదటిపేజీ తరువాయి

నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం సరైంది కాదని కేటీఆర్ పేర్కొన్నారు. సీరియస్‌గా సభ జరుగుతున్న సమయంలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినా సరైన సమాధానం లభించలేదని అన్నారు.

ప్రభుత్వం ప్రజా సమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇరిగేషన్ వంటి ముఖ్యమైన అంశాలపై సభలో లోతైన చర్చ జరగాల్సి ఉన్నప్పటికీ, ప్రభుత్వం పద్దులపై చర్చను త్వరగా ముగించాలని చూస్తోందని విమర్శించారు. కీలక అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ఎమ్మెల్యేలు మైదానాల్లో ఆటలు ఆడితే ప్రజలు ఎలా స్పందిస్తారని ప్రశ్నించారు.

ఈ నెల 28, 29 తేదీల్లో క్రీడా పోటీల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల కాలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించకుండా ఇలాంటి కార్యక్రమాలతో కాలయాపన చేయడం సరికాదని పేర్కొన్నారు. పద్దులపై చర్చకు తగిన సమయం కేటాయించకుండా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. కీలక అంశాలపై ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే క్రీడా పోటీలను సాకుగా చూపుతున్నారని కేటీఆర్ విమర్శించారు.



## రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

మొదటిపేజీ తరువాయి

ఈ పెట్టుబడుల గ్రౌండింగ్ వివిధ దశల్లో కొనసాగుతోందని, ఫలితంగా కొత్తగా 68,150 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుందని తెలిపారు. 2024 పర్యటనలో 18 ఎంవోయూలు కుదుర్చుకోగా రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 2025 పర్యటనలో 26 ఎంవోయూలు కుదుర్చుకోగా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు వివరించారు.

రూ.81,800 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్న ఆరు కంపెనీలకు భూములు కేటాయించామని, దీంతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మరో మూడు కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూములు గుర్తించినట్లు వెల్లడించారు. నిజామాబాద్ ఐటీ టవర్‌లో 11 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని, 681 సీట్ల సామర్థ్యంతో ఐటీ టవర్ నిర్మించామని చెప్పారు. ప్రస్తుతం 276 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు.

పెట్టుబడులపై విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారం సరికాదని, స్వార్థ రాజకీయాల కోసం చేసే ఈ ప్రచారం రాష్ట్రానికి మంచిది కాదని పేర్కొన్నారు. తాను పర్యవేక్షిస్తున్న శాఖల్లో పారదర్శకతకు కట్టుబడి ఉన్నానని, అదే విధానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

ఎంవోయూలు, పెట్టుబడులు, కంపెనీల అంశాలపై శ్వేతపత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు తీసుకొచ్చేందుకు వరల్డ్ ఎకానమిక్ ఫోరం వార్షిక సదస్సు మంచి వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వివిధ వేదికలపై రాష్ట్రంలోని అనుకూలతలు, అవకాశాలు, ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తేనే పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని తెలిపారు.

ప్రతి ఎంవోయూ అమలుకు సమయం పడుతుందని, ఆ విషయంపై అవగాహన లేక కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. దావోస్ పర్యటనలు, ఇతర సందర్భాల్లో కుదుర్చుకున్న ప్రతి ఎంవోయూను అమలు చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. టైర్2, టైర్3 పట్టణాల్లో పారిశ్రామికాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. పదేళ్ల తర్వాత ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీలో 'టీ ఫైబర్'ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపామని, రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలు, ప్రభుత్వ కార్యాలయాలకు 'టీఫైబర్' ద్వారా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.



## వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో పురుగుల భోజనం


- ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధింపు

**న్యూఢిల్లీ, సిరి న్యూస్ మార్చి 26:**

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. అతడికి అందించిన భోజనంలో పురుగులు కనిపించాయి. దీంతో రైల్వే శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధించింది. పట్నా టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రితేష్ కుమార్ అనే ప్రయాణికుడికి ఈ అనుభవం ఎదురైంది .రితేష్ కుమార్ మార్చి 15వ తేదీన పట్నాటాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో రితేష్‌కు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు కనిపించాయి. దీంతో షాకైన రితేష్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే సిబ్బంది కూడా ఆ భోజనాన్ని పరిశీలించారు. ఈ మొత్తం తతంగాన్ని రితేష్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. వీడియోపై రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షలు జరిమానా విధిస్తున్నట్టు తెలిపింది. అలాగే ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానా విధించడంతో పాటు అతడి కాంట్రాక్టును కూడా రద్దు చేసింది. రైల్వే ప్రయాణికుల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యం అని తేల్చి చెప్పింది.

# 2నుంచి ఇంటిగ్రేటెడ్ భూభారతి

- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్ నెంబర్
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:**

తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' చిక్కుముడులను విప్పుతూ రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలందించడమే లక్ష్యంగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్)ను ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు ప్రకటించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎనఐసి అధికారులతో మంత్రి గురువారం సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షల□□నుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఈ భూభారతి పోర్టల్‌ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్ డీమెరిట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులుచేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'ధరణి'ని బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చామన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయవిక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షా లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్‌తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుం<ని వివరించారు. ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే, కరెక్షన్, అప్పీల్, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్ వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్‌లో దాని వివరాలను తెలియజేస్తూ ఎసఎమఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకొచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎనఐసి అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి: తలసాని

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 26:**




బీసీ సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గురువారం అసెంబ్లీలో పద్దు అంశంపై మాట్లాడుతూ పలు ప్రశ్నలు లేవనెత్తారు.

జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రూ.20 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో రూ.45 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. రాజ్యసభకు ఇద్దరు బీసీ ప్రతినిధులను పంపినట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు, మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల ఏర్పాటు బీఆర్ఎస్ ఘనతేనని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, మంత్రులు ధర్నా చేస్తే అగ్రనాయకత్వం ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారా అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.

42 శాతం రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నప్పటికీ, బీసీ సబ్ ప్లాన్ అమలు రాష్ట్ర పరిధిలోనే ఉందని తెలిపారు. బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల కేటాయింపు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉందని, అయితే ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అంబేద్కర్ కల్పించిన హక్కుల కోసం పోరాడతామని తెలిపారు. రాష్ట్రంలో కులగణన పారదర్శకంగా జరగలేదని, బీసీ కమిషన్ నివేదికను ఇప్పటి వరకు ప్రజలకు అందుబాటులో ఉంచలేదని విమర్శించారు.

ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు, ఖర్చులకు పొంతన లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య కోసం ఒక్కొక్కరికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రస్తుతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా చెల్లించలేదని విమర్శించారు. బీసీ ప్రయివేట్ బిల్లును కాంగ్రెస్ పార్లమెంట్‌లో ఎందుకు ప్రవేశపెట్టలేదని తలసాని ప్రశ్నించారు.



## ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల కావడం లేదు: హరీశ్‌రావు


మొదటిపేజీ తరువాయి

ప్రధాన శస్త్రచికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించడం లేదని, దీనిపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు 607 మందికి నిధులు విడుదల చేశామని, ప్రస్తుతం మాత్రం 496 మందికే అందించారని అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చినా బిల్లులు విడుదల కావడం లేదని ఆరోపించారు. చిన్న చిన్న ఆసుపత్రులు మూతపడే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ కింద పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయో, వాటిని ఎప్పటిలోగా చెల్లిస్తారో సంబంధిత శాఖ మంత్రి సమాధానం ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఇంధన వినియోగదారులకు షాక్

- పెట్రో, డీజిల్ ధరలు పెంచిన నయారా

**న్యూఢిల్లీ, సిరి న్యూస్ మార్చి 26 :**





ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఇంధన వినియోగదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకుపైగా పెట్రోల్ పంపులు ఉండగా రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో ప్రముఖ ప్రైవేటు రంగ చమురు సంస్థ రిలయన్స్ బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో 'బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

# తెరుచుకున్న హోర్ముజ్ జలసంధి

- సరకు రవాణాకు ఇరాన్ అనుమతి

**టెహ్రాన్, సిరి న్యూస్ మార్చి 26:**



భారత్ సహా మిత్ర దేశాలకు హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ ద్వారా సరుకు రవాణా నౌకల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ప్రకటించారు. భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లకు సరుకు రవాణాకు అనుమతి లభించింది. అబ్బాస్ అరఘ్చి స్పందన గురించి ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అభ్యర్థించారు. దీని నేపథ్యంలోనే ఇరాన్ ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించాలని గుటెర్రెస్ అమెరికా, ఇజ్రాయిల్‌లను కోరారు. 'హోర్ముజ్ జలసంధిని మూసివేయడం చమురు, గ్యాస్ రవాణాను స్తంభింపజేస్తోంది. ఈ ప్రాంతంలో, వెలుపల పౌరులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు, అభద్రతతో జీవిస్తున్నారు. సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం' అని గుటెర్రెస్ ఒక ప్రకటనలో రాశారు.

**అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు : ఖర్గ్ ఐలాండ్‌లో మందుపాతరలు**

ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్ ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా తన బలగాలను మోహరిస్తోందని వార్తలు వస్తున్న ఈనేపథ్యంలో ఖర్గ్‌ను రక్షించుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా దళాలను అక్కడ అడుగుపెట్టనీయకుండా ఇరాన్ భారీగా మందుపాతరలు అమర్చినట్లు సమాచారం. వాటితో విధ్వంసకర ఉచ్చులు పన్నుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా అక్కడికి భారీగా బలగాలను కూడా తరలిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనం వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలోని ఓ దేశం సహకారంతో ద్వీపాలను ఆక్రమించు కోవాలని మా శత్రువులు సన్నాహాలు చేస్తున్నారన్న నిఘా సమాచారం ఉంది. శత్రువుల కదలికలను మేం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. శత్రువు ఒక్క అడుగు ముందుకువేసినా.. పశ్చిమాసియాలోని ఆ దేశంలోని కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఎడతెగని దాడులు చేస్తాం అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబాఫ్ ఇప్పటికే హెచ్చరికలు చేశారు. అమెరికా సైనికులు, కమాండర్ల ఆచూకీ చెప్పండంటూ పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ (ఎసజీని) విజ్ఞప్తి చేసింది. అమెరికా స్థావరాలపై తాము దాడులు చేస్తుండటంతో అక్కడున్న యూఎస్ సైనికులు ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని ఇరాన్ వెల్లడించింది. పశ్చిమాసియా దేశాల ప్రజలు వారి ఆచూకీని వెల్లడించాలని కోరుతున్నాం. అలాగే మీ భద్రత కోసం వారిని బహిష్కరించండని అడిగింది. తమ దాడుల్లో దెబ్బతిన్న అమెరికా స్థావరాలు నిర్జన ప్రాంతాలుగా మారాయని పేర్కొంది. 13 సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని వెల్లడించింది. భూతల దాడుల వార్తల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాన్ని ఇరాన్ హెచ్చరించింది. నెతన్యాహు, ట్రంప్ చేస్తోన్న మోసానికి మీ పిల్లలను బలిచేయకండంటూ హెచ్చరించింది.

# గుమ్మడిదల మున్సిపాలిటీ నిర్లక్ష్యం ప్రజలపై పన్నుల మోత

- సమాచారం లేక పెరిగిన పన్నుల భారం
- ఆరు నెలల చెల్లింపు విధానం తెలియక ప్రజలకు భారమైన పనులు
- ఇంటి పన్నుల విషయంలో స్పష్టత లేక ప్రజల ఆవేదన

**గుమ్మడిదల, మార్చి 26( సిరి న్యూస్):**


AXIS BANK
Commissioner and Director of Municipal Administration
COMMISSIONER GUMMADIDALA MUNICIPALITY
H No 4-84 Gummadidala Municipal Office
Hyderabad
Date: 2026-03-26 Time: 12:45:00
SALE
RRN:
AUTH CODE: 758879810637
UPI
PAID BY:
BASE AMOUNT: Rs.2,048.00
SIGNATURE NOT REQUIRED
7675805547@axl
VERSION V-2.0.0
Name BALAMANI
PTIN 1313200783
Service Rendered PROPERTY_TAX
Door No. 5-59
ULB Name Gummadidala Municipality
ULB ID

గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలో ఇంటి పన్నులు రెండు విడతలుగా, ఆరు నెలలకొకసారి చెల్లించాలనే నిబంధనపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా పన్నులు చెల్లించేందుకు వచ్చిన వారిపై అదనపు ఫైన్ విధించడం జరుగుతుంది. పన్ను చెల్లించేందుకు వచ్చిన గృహ యజమానులు, ఇంటి ఇంటి పన్ను తో పాటు అధికంగా భారం ఫైన్ రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపాలిటీ సిబ్బందిని ప్రశ్నించగా ఆరు నెలలకొకసారి పన్ను చెల్లించకపోవడంతో అదనపు భారం విధించబడిందని, అది ఆన్లైన్ వ్యవస్థలోనే ప్రతిఫలిస్తుందని వివరణ ఇచ్చినట్లు తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీ వ్యవస్థలో సంవత్సరానికి ఒకసారి పన్ను చెల్లించే విధానం ఉండగా, మున్సిపాలిటీగా మారిన తర్వాత కొత్తగా అమల్లోకి వచ్చిన ఈ నిబంధనపై ప్రజలకు సరైన సమాచారం అందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో మున్సిపాలిటీ అధికారులు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహించారని గ్రామాల వార్డు ప్రజలు వాపోతున్నారు. ఇకపై ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా స్పష్టమైన సమాచారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్ తో పాటు కౌన్సిలర్ సైతం తగు చర్యలు తీసుకొని ప్రజలకు మున్సిపాలిటీ చట్టం పరిధిలో ఉండే నిబంధనలను వివరించవలసిన అవసరం ఎంతైనా ఉందని గ్రామాల ప్రజలు కోరుతున్నారు సరైన సమాచారం లేకపోవడం వలన ప్రజలపై అధిక భారం పడుతుందని గుమ్మడిదల, బొంతపల్లి, దోమదుగు, అన్నారం, వీరన్న గూడెం గ్రామాల ప్రజలు తెలిపారు.

# శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి కళ్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- పనులను పర్యవేక్షించిన కమిషనర్

**గుమ్మడిదల, మార్చి 26 ( సిరి న్యూస్):**




పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి కళ్యాణోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ దశరథ పరిశీలించారు. సంప్రదాయబద్ధంగా, వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కళ్యాణోత్సవానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యే అవకాశమున్నందున తగిన మౌలిక సదుపాయాలు, శుభ్రత, తాగునీటి ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సాధిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసు కుంటామని తెలిపారు. పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ పవిత్ర కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ ఉత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వ హించబడేలా ప్రతి ఒక్కరూ సహక రించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఈవో ప్రభాకర్, దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ తులసీదాస్, రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

# కల్యాణ రామచంద్రస్వామి కల్యాణోత్సవాలకు ఆహ్వానం

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి,
- ఎంపీ రఘునందన్ రావు హాజరు కావాలని కోరిన ఆలయ కమిటీ సభ్యులు

**గుమ్మడిదల, మార్చి 26 (సిరి న్యూస్ ):**



గుమ్మడిదల మున్సిపాలిటీలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ కల్యాణ రామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్తో పాటు దేవాలయ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు. గుమ్మడిదల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలకు హాజరైన సందర్భంగా పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిసి కళ్యాణ రామచంద్రస్వామి కళ్యాణోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు. లోకక్షేమం కోసం నిర్వహించే ఈ పవిత్ర కార్యక్రమానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ప్రజాప్రతినిధులు ఆహ్వానాన్ని స్వీకరించి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పడమటి లక్ష్మారెడ్డి, వెంకట్రాం రెడ్డి , సంజీవరెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కొలన్ హన్మంత్ రెడ్డి చోరువు తో సీసీ రోడ్డు ప్రారంభం

**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి మార్చి 26 ( సిరి న్యూస్)**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ విలేజ్, ఇంద్రన్న కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా సదురు అధికారులతో మాట్లాడి జిహెచ్ఎంసి మున్సిపల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సీసీ రోడ్లను ప్రారంభించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాలనీ నిర్మాత కుంచెల సైదప్ప, కుంచల రాము, సరళ, లక్ష్మన్న, పి ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, సభావత్ రామచందర్ నాయక్, క్యాంటీన్ నాగరాజు వెంకట్ రెడ్డి, గట్టయ్య, ఆనంద్, మోహన్ రెడ్డి, శ్రీకాంత్ పంతులు, సంపత్ పంతులు, వాసు, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, విష్ణు, రామకృష్ణ, మల్లేష్, రజినీకాంత్, నాని, ప్లంబర్ శీను, మోహన్, శ్రీను, మహేష్, కనకరాజు, వెంకటలక్ష్మి , సత్యవతి, రమణబాబు, రాయుడు, కుంచాల, పాల బిందెల శ్రీనివాస్, శేఖర్ గుప్తా పాల్గొన్నారు

# వాల్టా యాక్ట్ పై అవగాహన


**తూప్రాన్ మార్చ్ 26 సిరి న్యూస్**



తూప్రాన్ మండలంలోని కిష్టాపూర్ గౌడిగూడెం గ్రామాలలో అక్రమ ఇసుక ఫిల్టర్ లు నిర్వహిస్తున్న వారికి గురువారం రోజు తూప్రాన్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు కిష్టాపూర్ గ్రామం నందు అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు గ్రామంలో గల ట్రాక్టర్ యజమానులను నిర్వాహకులను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించి వాల్టా యాక్ట్ గురించి మరియు పిడి ఆక్ట్ గురించి అవగాహన కల్పించి అక్రమంగా ఇసుక రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడం జరుగుతుందని గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో గ్రామస్తులకు తెలియజేయడం జరిగినది ఆర్ ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు అదేవిధంగా గౌడిగూడెం గ్రామంలో నాలుగు రోజుల క్రితం అక్రమ ఇసుకను సీజ్ చేసినటువంటి ఇసుక కుప్పలను ఇందిరమ్మ గృహాలకు అవసరం ఉన్నవారు వాడుకోవాలని గ్రామ సెక్రెటరీ సర్పంచి ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్టు ఆర్ ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు అందజేసిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత రెడ్డి





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి (సిరి న్యూస్) మార్చి 26**

బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు దూలపల్లి డప్పు మేఘన కుటుంబానికి 30,000 జీడిమెట్ల వీరమల్ల రాములు 60,000 కుత్బుల్లాపూర్ నివాసి సావిత్రి మానేనూర్ 41, 000 బాదురుపల్లి నివాసి సతీష్ కుటుంబానికి 55,000 దూలపల్లి నివాసి తుడుం రాజ్కుమార్ కుటుంబానికి 17,500 పేద కుటుంబాలకు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు నిరుపేద కుటుంబాలు బడుగు బలహీన వర్గాల సంక్షేమ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన తెలిపారు కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## టీజీస్పీడీసీల్ లో పలువురు సీఈ ల బదిలీలు !!

**హైదరాబాద్,మార్చి 26(సిరి న్యూస్):**

తెలంగాణ దక్షిణ మండలి విద్యుత్ సంస్థలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ టీజీస్పీడీసీల్ సీఎండీ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు సీఈ ప్రాజెక్టుగా పనిచేస్తున్న బిక్షపతి మెట్రోజోన్ కు,మెట్రో జోన్ సీఈ గా పనిచేస్తున్న వి ప్రభాకర్ ను సీఈ ఐపీసీ &అర్ఏసి కి ,సీఈ ఎచ్అర్డి గా పనిచేస్తున్న భాస్కర్ ను.సీజీఎం సిజిఅర్ఫ్ కు బదిలీ చేసారు కఖాళీ ఐన స్థానాలకు కొందరు అధికారులను ఇంచార్జ్లుగా నియమించారు .

## బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సాపూర్ చౌరస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి తెలంగాణం మార్చి 26 బాలనగర్:**



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం ఆచూకీ కోసం పోలీసుల గాలింపు బాల్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సాపూర్ చౌరస్తాలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహం లభ్యమయింది మజీద్ రోడ్డు డివైడర్ సమీపంలో గుర్తు శవం పడి ఉందన్న పక్కా సమాచారంతో బాల్నగర్ సీఐ నరసింహారాజు సిబ్బందితో కలిసి ఉటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు మృతి దేహాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడి వయసు 40 నుండి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని చనిపోయిన వ్యక్తి తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడని వెల్లడించారు పంచనామా నిమిత్తం మృదేహాన్ని గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని గుర్తించిన వారు ఎవరైనా ఉంటే 8712663209 8712663200 నెంబర్లను సంప్రదించాలని సిఐ నరసింహరాజు పేర్కొన్నారు

## పశుగ్రాస విత్తనాల పంపిణీ




**తూప్రాన్ మార్చ్ 26 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో గురువారం రోజు నాడు పశుగ్రాస విత్తనాల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ గొల్లపల్లి సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ లింగమూర్తి రైతులకు పశుగ్రాస విత్తనాల పాడి రైతులకు అందజేశారు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమం సందర్భంగా ఇస్లాంపూర్ పశు ఆరోగ్య ఉపకేంద్రం నుండి రైతుకు ఐదు కిలోల విత్తనాలను 75% సబ్సిడీతో అందజేస్తున్నారు ఈ సదా అవకాశాన్ని పాడి పరిశ్రమ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సంతోష్ రెడ్డి తెలిపారు పశు వైద్య అధికారి డాక్టర్ లింగమూర్తి మాట్లాడుతూ ఇస్లాంపూర్ ఉపకేంద్రం పరిధిలో 9 గ్రామాలు ఉన్నాయని 9 గ్రామాల పాడి రైతులకు సరిపోను పశుగ్రాస విత్తనాలు ఉన్నాయని సబ్సిడీ విత్తనాలు పొందడానికి రైతు యొక్క ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ 110 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని 5 కిలోల విత్తనం బ్యాగు సబ్సిడీ ద్వారా లభిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి సెక్రటరీ కల్పన పశు వైద్యాధికారులు గ్రామ పాడి రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి



**సిరి న్యూస్, ఆదిలాబాద్:** భారత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీపై తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గంద్రత్ సుజాత, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఇప్పసారా ఉత్పత్తి అంశంపై మాట్లాడుతుండగా స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ప్రస్తావిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ వ్యాఖ్యల సమయంలో అక్కడే ఉన్న ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు నవ్వుతూ స్పందించడం మరింత బాధాకరమని పేర్కొన్నారు. దేశానికి ఎన్నో సేవలు చేసిన ఇందిరా గాంధీ గొప్పతనం బీజేపీ నాయకులకు అర్థం కావడం లేదని విమర్శించారు. బ్యాంకుల జాతీయకరణ, పేదలకు గృహాల నిర్మాణం, గిరిజనులకు భూముల పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి దేశ సమగ్రత కోసం చివరి వరకు పోరాడి ప్రాణత్యాగం చేసిన మహానేతగా ఆమె నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు చెప్పుకునే అభివృద్ధి కార్యక్రమాలు లేకపోవడంతో బీజేపీ నాయకులు ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, వారు కేవలం అదాని, అంబానీ వంటి పెద్ద పారిశ్రామిక వర్గాల ప్రయోజనాలకే పనిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు గర్వంగా ఇందిరా గాంధీ పేరు పెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరా గాంధీపై చేసిన వ్యాఖ్యలకు బాధ్యులైన బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, అలాగే వాటిని ఖండించకుండా నవ్విన ఉమ్మడి ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, కౌన్సిలర్లు బూర్ల నర్మద, అన్నపూర్ణ, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బండి దేవదాస్ చారి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, సీనియర్ నాయకులు అశోక్ గౌడ్, దండు మధుకర్, ప్రభాకర్, అమృత్, ప్రేమల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం

- మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు




**సిరి న్యూస్, గంభీరావుపేట:** గంభీరావుపేట తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు ఆరోపించారు. పౌరులు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవడానికి అవసరమైన వివరాలు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమని తెలిపారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమాచార బోర్డుపై ప్రజా సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అప్పీలేట్ అధికారి పేర్లు, హోదాలు, ఫోన్ నంబర్లు స్పష్టంగా ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ బోర్డులో కేవలం హోదాలు మాత్రమే ఉండి పేర్లు, ఫోన్ నంబర్లు ఖాళీగా వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం–2005 ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సంబంధిత అధికారుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. అయితే గంభీరావుపేట తహశీల్దార్ కార్యాలయంలో ఈ నిబంధనలు పాటించడం లేదని విమర్శించారు. దీంతో సమాచారాన్ని పొందేందుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమాచార బోర్డును పూర్తి వివరాలతో నవీకరించాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు



**సిరి న్యూస్, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెరిగిన పిచ్చి మొక్కలను గురువారం తొలగించారు. పాముల భయం నెలకొనడంతో పాటు విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నట్లు ఎంపీఓ శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన–ప్రగతి నివేదిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు పాఠశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేపట్టడంతో పాటు బోర్‌వెల్ రిపేర్ పనులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యుత్ స్తంభానికి వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామంలో గుంతలు ఏర్పడి దెబ్బతిన్న రోడ్లపై మొరం వేసి చదును చేయడం జరుగుతుందని, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్తతో నిండిపోయిన కాలువలను సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన వీధుల్లో కూడా పిచ్చి మొక్కలను తొలగించి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ పంచాయతీ వార్డు సభ్యులు శ్రీనివాస్, కార్యదర్శి మీసారి వైకుంఠం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఎంపీడబ్ల్యూ సిబ్బంది వసంత్, రమేష్, మొండి, సలీం ఖాన్, నాయకులు అమీరుద్దీన్, దుర్గం తిరుపతి, రంగు సురేష్ గౌడ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**సిరి న్యూస్, ఆదిలాబాద్:** రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక"99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకంపై నిర్వహించిన రైతు శిక్షణ, ఆస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 21వేల విత్తన కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఒక్కో కిట్ విలువ సుమారు రూ.500 ఉంటుందని తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. భూమి లేని వారు తేనెటీగల పెంపకం వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు నాబార్డ్ తదితర పథకాల ద్వారా 35 నుంచి 45 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. రైతులు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీఓ) గా ఏర్పడి ముందుకు రావాలని, అవసరమైతే భూమి కేటాయించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా వినియోగించాలని, ఆవు పేడ, మూత్రంతో చేసే ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. ఎస్టీ రైతులకు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్‌లో 7 నుంచి 10 రోజుల పాటు ఉచిత శిక్షణ కల్పిస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా హెల్ప్‌లైన్ నంబర్ 14416 కి కాల్ చేయాలని సూచించారు. వినాయక్ చౌక్ రైతుబజార్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతులు కోరగా, కమిటీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, శాస్త్రవేత్త మల్లేష్, ఉద్యానవన అధికారులు అలేఖ్య, క్రాంతి కుమార్, ఏవో అష్రఫ్, రైతు సంఘం నాయకులు గోవర్ధన్ రెడ్డి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు



**సిరి న్యూస్, నేరడిగొండ:** పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. ఏనుగు లక్ష్మారెడ్డి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూతనంగా నియమితులైన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆడే గజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకాన్ని ఉంచి పదవి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నియామలు తూచా తప్పకుండా పాటిస్తానని అన్నారు. అనంతరం గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను, పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, అందులో భాగంగానే ఏనుగు లక్ష్మారెడ్డిను పార్టీ గుర్తించి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మల్లు గారి నర్సా గౌడ్‌కు సన్మానం



**సిరి న్యూస్, గంభీరావుపేట:** గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ భర్త మల్లుగారి నర్సా గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మల్లుగారి నర్సా గౌడ్ గ్రామస్థాయిలో మంచి పేరు సంపాదించుకున్నారని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అనంతరం మల్లుగారి నర్సా గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని, ప్రజాసేవే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి బాల్రెడ్డి, తిమ్మాపూర్ ఉప సర్పంచ్ జజ్జరి దేవేందర్ ముదిరాజ్, నాయకులు దండు శ్రీనివాస్ ముదిరాజ్, నమలికొండ సత్తయ్య, రాజు, తిరుపతి, రమేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొండూరి రవీందర్ రావుకు సన్మానం



**సిరి న్యూస్, గంభీరావుపేట:** తెలంగాణ రాష్ట్ర నాబార్డ్ చైర్మన్‌గా మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కొండూరి రవీందర్ రావును బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. గంభీరావుపేటకు గురువారం మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా మండల బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ ఖుతుబుద్దీన్ కొండూరి రవీందర్ రావును శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కీలక పదవికి మూడవసారి ఎన్నిక కావడం గర్వకారణమని, ఆయన నాయకత్వంలో సహకార రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## రాములవారి కళ్యాణానికి పట్టు వస్త్రాల అందజేత



**సిరి న్యూస్, తాండూర్:** తాండూర్ మండలం ద్వారకాపూర్ గ్రామంలో రాములవారి కళ్యాణోత్సవం సందర్భంగా భద్రాచలం నుంచి తీసుకువచ్చిన గోటితో వెలిసిన తలంబ్రాలు, ముత్యాలు, పట్టు వస్త్రాలను గురువారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసాడి శ్రీదేవి, శ్రీరాములు ఆలయ కమిటీ సభ్యులకు తలంబ్రాలు, ముత్యాలు, పట్టు వస్త్రాలను అందజేశారు. రాములవారి కళ్యాణం వైభవంగా జరగాలని ఆకాంక్షిస్తూ వారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లాకుల రవి, చంద్రగిరి శ్రీనివాస్, సురేష్, లక్ష్మణ్, కన్నాల మాజీ సర్పంచ్ జిల్లపల్లి స్వరూప వెంకటస్వామి, ఎక్స్ ఎంపీటీసీ దూగుట స్వప్న, అయ్యగారు విష్ణు, ఆంజనేయ స్వాములు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం



**సిరి న్యూస్, ఇచ్చోడ:** ఇచ్చోడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ పటేల్, జిల్లా అధికార ప్రతినిధి కొమరం కోటేశ్వర్లను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాధవ్ పటేల్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ కీలక నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కుటుంబ సభ్యుల్లా కలిసి తనను, జిల్లా అధికార ప్రతినిధి కోటేశ్వర్‌ను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, బోథ్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, మాజీ ఎంపీటీసీ జాహీద్, సీనియర్ నాయకులు మహమ్మద్, రషీద్, చోలే ప్రభాకర్, మహబూబ్, భూతి లక్ష్మణ్, సాదిఖ్, మేస్త్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి ఉత్తమ బోధనా పద్ధతుల అధ్యయన కమిటీకి పేట వాసి ఎంపిక

**పెద్దశంకరంపేట, మార్చి26, (సిరి న్యూస్):**



ప్రపంచ స్థాయి ఉత్తమ బోధన పద్ధతులను అధ్యయనం చేయడం కోసం టీచర్స్ ఎక్స్ పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషన్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం లో భాగంగా విదేశాల పర్యటనకు వెళ్లే ఉపాధ్యాయుల జాబితాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. పెద్దశంకరంపేట కు చెందిన ఉపాధ్యాయుడు కోయిల కొండ బాలాజీ ఇందు కోసం ఎంపికయ్యారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన తో పాటు మరో ఇద్దరు టీచర్లు కూడా ఫిన్లాండ్ దేశం లోని అంతర్జాతీయ ఉత్తమ విద్యా ప్రమాణాలు, ఉత్తమ బోధనా పద్ధతులను పరిశీలించనున్నారు. ఏప్రిల్ 20 నుంచి 24 తేదీ వరకు విదేశాల్లో పర్యటించనున్నారు. ఆయన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మొన్నటి వరకు శంకర్ పల్లి లో టీచర్ గా పని చేశారు. ప్రపంచ స్థాయి పర్యటనకు ఎంపికైన బాలాజీని పలువురు అభినందించారు.

# సత్తుపల్లిలో మట్టి తవ్వకాల కలకలం

## ప్రజల్లో ఆందోళన




**సిరి న్యూస్, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్న తీరు స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సత్తుపల్లి–రేజర్ల ప్రధాన రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా గోతులు తవ్వి మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రహదారి భద్రతకు ముప్పు ఏర్పడిందని ప్రజలు చెబుతున్నారు.ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ గోతులు స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో గోతుల కారణంగా రహదారి వెడల్పు తగ్గిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక మట్టి తరలింపులో ఉపయోగిస్తున్న టిప్పర్ వాహనాలు పట్టణంలో అధిక వేగంతో సంచరిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిపై సంబంధిత శాఖలైన రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు దృష్టి సారించి అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఘనంగా అశోక చక్రవర్తి జయంతి వేడుకలు



**సిరి న్యూస్, కాగజ్‌నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని దీక్ష భూమి వద్ద సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామ్రాట్ అశోకుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన జీవితం, బౌద్ధ ధర్మ ప్రచారం, ప్రజా సేవలపై నాయకులు ప్రసంగించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ అశోక చక్రవర్తి శాంతి, అహింసా మార్గాలను ప్రపంచానికి పరిచయం చేశారని కొనియాడారు. ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల దేశభక్తి గీతాలు, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో ఉచిత ఎంసెట్ కోచింగ్




**సిరి న్యూస్, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని పేద విద్యార్థుల కోసం టార్గెట్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కోచింగ్‌లో భాగంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యార్థులకు బోధన చేస్తారని చెప్పారు. విద్యార్థుల ప్రతిభను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ అందిస్తామని అన్నారు. కోచింగ్ కాలం 30 రోజుల పాటు ఉంటుందని, ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. కాగజ్‌నగర్‌లోని వేసుందర జూనియర్ కాలేజ్‌లో ఈ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఇతర వివరాల కోసం టార్గెట్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సీఈఓ అంబాలా సాయికుమార్ సెల్:9966162221, 6305463336లపై సంప్రదించవచ్చని సూచించారు.

# వ్యాపార నిర్ణయంలో ఏఐ&ఎంఎల్ వినియోగంపై కార్యశాల

**పటాన్ చెరు, మార్చి 26, (సిరి న్యూస్):**

గీతంలో మే 25 నుంచి 29 వరకు, ప్రతిరోజూ సాయంత్రం 6.00 నుంచి రాత్రి 9.00 గంటల వరకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో 'వ్యాపార నిర్ణయం తీసుకోవడం కోసం కృత్రిమ మేధస్సు & యంత్ర అభ్యాసం'పై మే నెల 25 నుంచి 29 వ తేదీ వరకు, ప్రతిరోజూ సాయంత్రం 6.00 నుంచి రాత్రి 9.00 గంటల వరకు ఐదు రోజుల ఆన్ లైన్ ఆచారణాత్మక కార్యశాల (యాజమాన్య వికాస కార్యక్రమం – ఎండీపీ)ను నిర్వహిస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆధునిక వ్యాపార నిర్ణయం తీసుకోవడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) యొక్క పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సదస్యులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఏఐ–ఆధారిత విశ్లేషణలు వినియోగదారులను ఆకట్టుకోవడం, డిమాండ్ అంచనా, నష్ట అంచనా, ఆయా సంస్థలకు అనుగుణంగా మార్కెటింగ్ వంటి రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్నందున, డేటా–ఆధారిత నిర్ణయాల కోసం ఈ సాంకేతికతలను వినియోగించడానికి ఆచరణాత్మక అంతర్దృష్టుల తో ఈ శిక్షణలో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడానికి ప్రయత్నిస్తామని వివరించారు. ప్రధానంగా నిర్వహణ, వాణిజ్యం, ఆర్థిక శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్లు, ఇంజనీరింగ్ విభాగాల నుంచి అధ్యాపకుల కోసం రూపొందించినట్టు తెలియజేశారు. ఎంఎల్ ను పూర్తిగా సాంకేతిక అంశంగా పరిగణించడం కంటే వ్యాపార–ఆధారిత వినియోగ కేసులు, ఆచరణాత్మక ప్రదర్శనలు, నమూనా ఉత్పత్తి వివరణపై కార్యశాల దృష్టి పెడుతుందన్నారు. ఇందులో పాల్గొనేవారికి ఏఐ, ఎంఎల్ భావనలను అందుబాటులో ఉంచడానికి ఆచరణాత్మక డేటాసెట్లు, విజువలైజేషన్ ఆధారిత వివరణలు, ఉపయోగించడానికి సులభమైన విశ్లేషణ అంతర్ముఖంగా ఉపయోగిస్తామని తెలిపారు. బిజినెస్ అనలిటిక్స్, డేటాసైన్స్, ఏఐ–ఎంఎల్ అప్లికేషన్లలో విస్తృత అనుభవం ఉన్న విద్యావేత్త, పరిశోధకుడు డాక్టర్ ఎం.కామాక్షయ్య ప్రధాన శిక్షకుడిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షించిన, పర్యవేక్షించని అభ్యాసం, సిఫారసుదారు వ్యవస్థలు, సమిష్టి నమూనాలు వంటి కీలక అంశాలను వివరిస్తుందని తెలిపారు. ప్రతి సాంకేతికతను వినియోగదారుల అంచనా, మార్కెట్ విభజన, ఉత్పత్తి సిఫార్సు, మోసం గుర్తింపుతో సహా వాస్తవ–ప్రపంచ నిర్వాహక ప్రశ్నలను అనుసంధానిస్తుందని వివరించారు. ఈ కార్యశాల పూర్తయ్యేసరికి, ఇందులో పాల్గొనేవారు విషయ పరిజ్ఞానంపై అవగాహనతో పాటు ఏఐ–ఎంఎల్ పద్ధతులను ఆచరణాత్మకంగా తెలుసుకుంటారని తెలిపారు. ఈ పద్ధతులను వ్యాపార నిర్ణయ సమస్యలకు వర్తింప జేయడానికి, ఏఐ–ఆధారిత అధ్యయనాలు (కేస్ స్టడీస్), విద్యార్థి ప్రాజెక్టులను రూపొందించడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు, తమ పేర్ల నమోదు, రుసుము, ఇతరత్రా వివరాల కోసం jpaul@gitam.edu కు ఈ–మెయిల్ చేయాలని లేదా డాక్టర్ జోసెఫ్ పాల్ ను సంప్రదించాలని సూచించారు.

# హైడ్రా అడుగులు.... రెవెన్యూ పరుగులు

- కబ్జాలు చేస్తే తాటతీస్తా... తాసిల్దార్ హెచ్చరింపు..
- కబ్జాలకు... ఇక నో ఎంట్రీ...
- అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ గర్జన...
- రెవిన్యూ అధికారుల పర్యవేక్షణలో ఆపరేషన్...
- హైడ్రా చర్యలతో వేగం పెంచిన రెవిన్యూ శాఖ...

**అమీన్ పూర్ సిరి న్యూస్**

అమీన్ పూర్ మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో రాజకీయ నాయకుల అండదండలతో అక్రమ నిర్మాణాలు జోరుగా చేపట్టారు. ఇటీవల ఐడ్రా కమిషనర్ రంగనాథ్ తన బృందంతో కలిసి అమీన్పూర్ లో పర్యటించారు. పలు సర్వే నంబర్లల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సుడిగాలి పర్యటన చేశారు.. ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను సర్వే చేపట్టి గుర్తించి కూల్చివేతలు చేపట్టాలని ఆదేశించారు. గురువారం తహసిల్దార్ వెంకటేష్ ఆదేశాల మేరకు ఆర్ఐ సంగీత ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో కబ్జాలను గుర్తించి బుల్డోజర్ తో కూల్చివేతలు చేపట్టారు. ఏలాంటి ఒత్తిడిలకు లొంగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ముక్తకంఠంతో తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలు గురువారం నేలమట్టం చేయడం జరిగింది. హైడ్రా & రెవిన్యూ సంయుక్త చర్యలతో భారీ కూల్చేతలు చేశాం అని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సర్వే నంబర్ 993 చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేయడం జరిగింది అని అన్నారు. సర్వే నంబర్ 823 అమీన్పూర్ విలేజ్ లో వెలసిన నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేయడం జరిగిందని తెలిపారు.





# పెట్రోల్ కొరత భయం ...బంకుల వద్ద క్యూ లైన్లు





- పెట్రోల్ స్టాక్ ఉన్నా నో స్టాక్ బోర్డ్
- పెట్రోల్ ఉన్నా పోయడం లేదంటూ వాహనదారుల ఆందోళన

**గుమ్మడిదల, మార్చి 26( సిరి న్యూస్):**

గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో పలు పెట్రోల్ బంకుల వద్ద బుధవారం వాహనదారులు భారీగా బారులు తీశారు. పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందన్న వదంతులతో ప్రజలు ముందస్తు జాగ్రత్తగా ఇంధనం నింపించుకునేందుకు పరుగులు తీయడంతో బంకుల వద్ద క్యూ లైన్లు కనిపించాయి. ప్రత్యేకంగా బొంతపల్లి పారిశ్రామిక వాడలోని హెచ్ పి పెట్రోల్ పంప్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. బంకులో పెట్రోల్ అందుబాటులో ఉన్నప్పటికీ వినియోగదారులకు ఇంధనం పోయడం లేదని ఆరోపిస్తూ ద్విచక్ర వాహనదారులు వాపోయారు. పెట్రోల్ అందుబాటులో ఉన్నప్పటికీ నో స్టాక్ బోర్డు పెట్టి వినియోగదారులను పెట్రోల్ పంపు యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సిబ్బంది పరిస్థితిని సమీక్షించి వాహనదారులను శాంతింప చేశారు. పెట్రోల్ ధరలను రాష్ట్ర ప్రభుత్వం పెంచితే పెంచిన ధరకు అమ్మవచ్చని ఉద్దేశంతో పెట్రోల్ బంక్ యజమానులు సైతం పెట్రోల్ ఉన్నప్పటికీ లేదని బుకాయిస్తూ నో స్టాక్ బోర్డులను పెడుతున్నారు. ఈ విషయమై మండల అధికారులు పెట్రోల్ పంపులను తనిఖీ చేసి పెట్రోల్ పంపులు ఉన్న స్టాక్ ఎంత వినియోగించింది ఎంత వివరాలను సేకరించాలని వినియోదారులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ఎలాంటి పెట్రోల్, డీజిల్ కొరత లేదని పౌర సరఫరాల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మి భయాందోళనకు గురి కావద్దని సూచిస్తున్నప్పటికీ, బంకుల వద్ద మాత్రం జనసందోహం తగ్గడం లేదు. ఇంధన కొరతపై స్పష్టత ఉన్నప్పటికీ, అపోహలతో ప్రజలు పెద్దఎత్తున బంకుల వద్దకు చేరుకోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. అధికారులు అవగాహన కల్పిస్తూ పరిస్థితిని నియంత్రించాల్సిన అవసరం ఉన్నదని స్థానికులు భావిస్తున్నారు.

# భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల పర్యవేక్షణలో పట్టణం
- 2వేల మంది పోలీసులతో ప్రత్యేక నిఘా

**సిరి న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరగనున్న శ్రీరామనవమి వేడుకల సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శుక్రవారం జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం, శనివారం జరిగే పట్టాభిషేకం మహోత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉండడంతో ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కూడా ప్రత్యేక బృందాలతో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. సుమారు 2వేల మంది పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, ఆన్‌లైన్ లింక్‌ను రూపొందించినట్లు తెలిపారు. భద్రాచలం పట్టణం మొత్తం డ్రోన్ కెమెరాలు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందని వివరించారు. రెండు రోజుల పాటు పోలీసు శాఖ విధించే ట్రాఫిక్ ఆంక్షలను పట్టణ ప్రజలు, భక్తులు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

# మోహం మీద ముడతలు పోవాలంటే.. ఇవే టిప్స్

ముఖం అందంగా కనిపించాలని ప్రతీ ఒక్కరూ ఏదో ఒక్క ప్రయత్నం చేస్తునే ఉంటారు. వయస్సు పైబడే కొద్దీ ముఖంపై ముడతలు సమస్య ఎక్కువైపోతుంది. ఇప్పడుఉన్న జీవన విధానంలో చిన్నవయస్సులోనే ముడతల సమస్య ఇబ్బందిపెడుతోంది. కాలుష్యం, ఒత్తిడి, పోషకాహార లోపం, ఒత్తిడి కారణంగా ముడతలు వచ్చే అవకాశం ఉంది. చాలా మంది ముడతలు తగ్గించుకోవడానికి కాస్మెటిక్ ప్రొడక్ట్స్ వాడుతారు.
నాచురల్‌గానే ముడతలను మాయం చేయడానికి కొన్ని చిట్కాలు సహాయపడతాయి. అవేంటో తెలుసుకుందాం.





నేరుగా తాకే ఎండ వల్ల చర్మం అడుగున ఉండే కొల్లాజెన్ దెబ్బతిని, తరిగిపోయి ముడతలు ఏర్పడే అవకాశం ఉంది. కలబందలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. కలబదం గుజ్జును తరచూ ముఖానికి అప్లై చేసుకుంటే హైడ్రేషన్‌ను మెరుగుపరుస్తుంది. ఇది ముడతలు, ఫైన్‌లైన్స్‌ను తగ్గిస్తుంది. అలాగే..తేనెలోని యాంటీఆక్సిడెంట్ గుణాలు ఫ్రీరాడికల్స్ నుంచి చర్మ కణాలను రక్షిస్తాయి. చర్మంపై త్వరగా ముడతలు పడకుండా కాపాడతాయి. ముడతలను నివారించాడానికి తేనెను ముఖానికి అప్లై చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీన్ని 20 నిమిషాల పాటు ఆరనిచ్చి.. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం శుభ్రం చేసుకుంటే ముడతలు తగ్గుతాయి. కొబ్బరి నూనెలో ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి పోషణ అందించడానికి తోడ్పడుతుంది. నిద్రపోయే ముందు ముఖం శుభ్రం చేసుకుని, కొద్దిగా కొబ్బరి నూనెతో ముఖాన్ని సున్నితంగా మసాజ్ చేయాలి. ఉదయం నిద్రలేచిన తర్వాత చల్లని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ముడతలు పోగొట్టడంలో పెరుగు కూడా తన పాత్ర పోషిస్తుంది. ముఖానికి పెరుగు అప్లై చేసి, 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. ముడతలు మాయం అయ్యి, కాంతివంతమైన చర్మం పొందవచ్చు.



# నల్లని ద్రాక్షలో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో..

నల్లని ద్రాక్ష.. ఈ పండ్లు చాలా వరకు అందరికీ తెలుసు. సహజంగా ఇవి పుల్లగా ఉంటాయని తినడానికి ఇష్టపడరు. పచ్చని ద్రాక్షపండ్లనే ఇష్టపడుతూ ఉంటారు. ఐతే నల్లద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఉన్నాయి. ఈ పండ్లు తింటే పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అవేమిటో తెలుసుకుందాం.



క్రమం తప్పకుండా తీసుకుంటే నల్ల ద్రాక్షతో పలు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చు. ఈ నల్ల ద్రాక్షలో విటమిన్లు ఎ, సి, బి6, ఫోలిక్ యాసిడ్స్, సిట్రస్ యాసిడ్స్, గ్లూకోజ్, మెగ్నీషియం, జింక్ వంటి అనేక పోషకాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పండ్లు పొటాషియం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. విటమిన్ సిని కలిగి ఉండి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే నల్ల ద్రాక్షలో ఇనుము, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు జుట్టు కుదుళ్లను స్ట్రాంగ్ చేయడానికి సహాయపడతాయి. నల్ల ద్రాక్షను తీసుకోవడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపక శక్తిని మెరుగు పరుస్తుంది. మైగ్రేన్ తో బాధ పడేవారు కూడా నల్ల ద్రాక్షను తీసుకుంటే కంట్రోల్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు. నల్ల ద్రాక్షను తినడం వల్ల మధు మేహాన్ని కంట్రోల్ చేసుకోవచ్చు. నల్లద్రాక్షలో ఉండే ఫైటోకెమికల్స్ గుండెలో పేరుకొనే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి అక్కడి కండరాలకు మేలుచేస్తాయని వెల్లడైంది. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను తొలగించి, బరువు తగ్గించేందుకు కారణం అవుతాయి.




# గుడికి కురులు విరబోసుకోని వెళ్తున్నారా..?

గుడి.. ఈ ప్రాంగణాన్ని అత్యంత పవిత్రమైనదిగా మన హిందువులు భావిస్తూ ఉంటారు. సాధారణంగా ఒక మహిళ గుడికి వెళ్ళే ముందు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్నది పురాతన కాలం నుండి పూర్వీకులు కొన్ని శాస్త్రాలను రూపొందించి పెట్టారు. ఇప్పడు ఉన్న ప్రస్తుత జీవన విధానంలో ఎన్నో మర్పులు వచ్చాయి. ఎన్నో పద్ధతులు,అలవాట్లు మారాయి. ఇందులో ముఖ్యంగా మహిళలు జుట్టు విరబోసుకోని గుడికి వెళ్లడం మంచిది కాదని శాస్త్రాలు బెబుతున్నాయి..అవేంటో తెలుసుకుందాం

ఒకప్పడు మహిళలు కురులను ముడుచుకొని చక్కగా వాటి చుట్టు పువ్వులను అలంకరించుకొని గుడికి వెళ్లేవారంటా. ఇప్పడు ఉన్న పరిస్థితుల్లో చలా మంది గుడికి కురులు విరబోసుకునే వెళ్తుంటారు. జుట్టు విరబోసుకుని ఉంటే పూజలు దేవుడి అంగీకరించరు అన్న విషయం ప్రచారంలో ఉంది. అలాగే..గుడికి వెళ్ళినప్పడు మన మనసు అంతా దేవుడి మీదనే ఉండాలి. ఇక పూజలో ఉన్న సమయంలో వెంట్రుకలు విరబోసుకుని ఉంటే అవి మనల్ని ఎంతగానో ఇబ్బంది పెట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి స్త్రీలు గుడికి వెళ్ళే ముందు వెంట్రుకలు మంచిగా జడ వేసుకుని వెళ్ళాలి. శాస్త్రాల ప్రకారం దేవుడి సన్నిదిలో చిన్న వెంట్రుక పడిన దోషంగానే పరిగనించబడుతుంది. అయితే చాలా మందికి ఎందుకు అలా చేయకూడదు అని సందేహం కలుగవచ్చు. అయితే దీనికి శాస్త్రాలలో తగు కారణాలు చెప్పబడి ఉన్నాయి. గుడిలోకి తల విరబోసుకుని వెళ్ళకూడదు అని మన ఇంట్లో కూడా తరచూ చెప్పడం మీరు గమనించవచ్చు.





# వేడిని తట్టుకునే టిప్స్

గత కొద్ది రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్నారు. ఎండ అధికంగా ఉండడంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే దాని బారిన పడే అవకాశం లేకపోలేదని సూచిస్తున్నారు. 'బయటకు వెళ్లేవారు గొడుగు, కళ్లద్దాలు, హెల్మెట్, గ్లౌజ్‌లు వాడాలి. తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేవిధంగా చూసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగడం ఈ సమయంలో ఆరోగ్యానికి మంచిది. ఒంటికి వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తీసుకోవాలి. ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలి. ఎండలోకి తప్పనిసరిగా వెళ్లేవారు సన్‌స్క్రీన్ లోషన్స్ తప్పనిసరిగా వాడాలి. ముఖ్యంగా పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలి. ఉదయం 8 గంటలలోపే పిల్లలకు స్నానాలు ముగించాలి. వారికి పలుచని దుస్తులు వేయాలి. అదేవిధంగా వృద్ధుల విషయంలో కూడా అత్యంత జాగ్రత్తగా ఉండాలి. వారు ఇంటి నుంచి బయట రాకుండా ఉండేలా చూడాలి. ఒకవేళ తప్పనిసరి అయితే, అన్ని జాగ్రత్తలు తీసుకుని వారిని బయటకు తీసుకురావాలి' ఇలా జాగ్రత్తలు తీసుకుంటే ఎండ నుంచి ఎండా వేడిమి నుంచి బయటపడొచ్చని చెబుతున్నారు.



# నమ్మొచ్చా.. 'భైరవ-రుద్ర' సేమ్ టు సేమ్ అట!?



తెలుగు సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా మరింత చాటి చెప్పేలా వస్తున్న రెండు భారీ ప్రాజెక్ట్స్ మధ్య ఇప్పుడు ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'కల్కి 2898 AD' ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించగా, ప్రస్తుతం సీక్వెల్ షూటింగ్ జరుగుతోంది. ఇక రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న 'వారణాసి' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, ఈ రెండు సినిమాల్లోని హీరోల పాత్రలకు సంబంధించిన న్యూస్ ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన 'కల్కి'లో ప్రభాస్ భైరవ అనే బౌంటీ హంటర్ పాత్రలో కనిపించారు. మోడ్రన్ టెక్నాలజీ మరియు పురాణాలను మేళవించి చూపించిన ఈ పాత్ర ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చింది.

అయితే, ఇప్పుడు వారణాసి సినిమాలో మహేష్ బాబు పోషిస్తున్న రుద్ర పాత్ర కూడా బౌంటీ హంటర్ తరహాలోనే ఉంటుందని, గత మూడు నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ పాత్రకు త్రేతాయుగంలోని శ్రీరాముడి పాత్రకు లింక్ ఉంటుందని అంటున్నారు. కల్కిలో ప్రభాస్ భైరవ పాత్ర, ద్వాపర యుగంలోని కర్ణుడి పాత్రకు లింక్ అయిన సంగతి తెలిసిందే. దీంతో.. ప్రభాస్‌మహేష్ ఒకే తరహా పాత్రలు పోషిస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఈ సినిమాల కథా నేపథ్యం మాత్రం వేరే అయినప్పటికీ.. ఇద్దరు హీరోలు మాత్రం బౌంటీ హంటర్లే.. అనేదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అలాగే.. వారి మూలాలు పురాణ పురుషులతో ముడిపడి ఉండటం విశేషం. అయితే, వారణాసిలో మహేష్ బాబు బౌంటీ హంటర్ అనే వార్తల్లో ఎంత వరకు నిజముందనేది ఇప్పుడే ఓ అంచనాకు రాలేము. అన్నట్టు.. వారణాసిలో మహేష్ బాబు శ్రీరాముడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. రాజమౌళి మేకింగ్‌కు థియేటర్లో రాముడి ఎపిసోడ్‌కు గూస్‌బంప్స్ గ్యారెంటీ!



## రామ్ చరణ్ కంటికి సర్జరీ..
## మెగాస్టార్ ఎమోషనల్ పోస్ట్!

'పెద్ది' సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు."డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు" అని చిరంజీవి పేర్కొన్నారు.

తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మేరకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి 'పెద్ది' షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పెద్ది టీమ్ కూడా స్పందించింది. చరణ్ తిరిగి షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టుగా తెలిపింది. గాయం చిన్నదే కావడంతో సినిమా పనులకు పెద్దగా ఆటంకం కలగదని రామ్ చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్ కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.




## టూ పీస్ అవుట్ ఫిట్‌లో రచ్చ.. సమ్మర్‌ను మరింత హీట్ ఎక్కిస్తోన్న వాణీ!

- ఆఫర్స్, హిట్స్ లేక అల్లాడిపోతున్న వాణీ కపూర్
- కెరీర్ స్టార్ట్ చేసి పుష్కర కాలం అవుతున్నా చెప్పకోదగిన హిట్స్ లేవు
- టూ పీస్ అవుట్ ఫిట్‌లో వాణీ రచ్చ

కొన్నాళ్ల నుంచి బాలీవుడ్ హాట్ బ్యూటీ వాణీ కపూర్ స్టార్ డమ్ కోసం వెయిట్ చేస్తోంది. కానీ ఆ అదృష్టం మాత్రం దక్కడం లేదు. ఆఫర్స్, హిట్స్ లేక అల్లాడిపోతున్నారు. తనతో పాటు కెరీర్ స్టార్ట్ చేసిన ఆమె బెస్టీ రాశీ ఖన్నా తెలుగు, తమిళ్లో స్టార్ డమ్ తెచ్చుకుని.. బాలీవుడ్‌లో ఆఫర్స్ అందుకుంటోంది. కానీ వాణీ మాత్రం సరైన అవకాశాల్లేక స్ట్రగుల్స్ ఫేస్ చేస్తూనే ఉంది. కెరీర్ స్టార్ట్ చేసి పుష్కర కాలం అవుతున్నా.. చెప్పకోదగిన హిట్స్ లేవు.

శుద్ధ్ దేశీ రొమాన్స్, బేఫికర్, వార్ లాంటి చిత్రాలు వాణీ కపూర్‌కు స్టార్‌డమ్ తెచ్చిపెట్టినా.. ఆ తర్వాత వరుస ఫ్లాపులు ఆమె కెరీర్‌ను డైలమాలో పడేశాయి. గత ఏడాది రైడ్ 2తో గట్టెక్కానని ఫీలైనా.. ఆ వెంటనే వచ్చిన అబీర్ గులాల్ మూవీ వాణీ ఇమేజ్ డ్యామేజ్ చేసింది. వరుస ఫ్లాపులు వాణీ కెరీర్‌ను గ్రాఫ్ డౌన్ ఫాల్ చేయడంతో పాటు, ఆఫర్లు కూడా తగ్గేలా చేశాయి. హృతిక్ రోషన్, రణవీర్ సింగ్, అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్ లాంటి స్టార్ హీరోలతో నటించినా.. ఇప్పుడు చేతిలో చెప్పకోదగ్గ సినిమాలు కూడా లేవు.

ఓవైపు హిట్స్, మరోవైపు ఆఫర్స్ లేక అల్లాడిపోతున్న వాణీ కపూర్ సోషల్ మీడియాలో మాత్రం రచ్చ చేస్తున్నారు. టూ పీస్ డ్రెస్‌లో ఫోటోలకు ఫోజులిస్తూ.. సమ్మర్‌ను మరింత హీట్ ఎక్కిస్తున్నారు. తన స్టన్నింగ్ లుక్స్‌తో యూత్‌తో పాటు మూవీ మేకర్స్ అటెన్షన్ గ్రాబ్ పనిలో ఈ డిల్లీ గాళ్ ఉన్నారు. సిల్వర్ స్క్రీన్‌పై గ్లామర్ షోకు అడ్డుచెప్పని వాణీ.. ఇప్పుడు నెట్టింట్లో కూడా టూ పీస్ అవుట్ ఫిట్‌లో ప్రొఫైల్ బిల్డ్ చేసుకుంటున్నారు. వాణీ మళ్లీ ట్రాక్‌లోకి వస్తారేమో చూడాలి.



## లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు
## అందుకున్న బాలయ్య

నందమూరి బాలకృష్ణ కెరీర్లో ఆయనకు మరో అరుదైన గౌరవం వచ్చి చేరింది. న్యూఢిల్లీలోని భరత్ మండపంలో అట్టహాసంగా జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (IFFD) 2026 వేడుకల్లో బాలకృష్ణను 'భైరవరుద్ర' సేమ్ టు సేమ్ అట!?'జీవిత సాఫల్య పురస్కారం' (Lifetime Achievement Award)తో ఘనంగా సత్కరించారు. సినిమా రంగంలో యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న బాలకృష్ణ పౌరాణిక పాత్రల్లో తండ్రికి తగ్గ తనయుడిగా మెప్పించడమే కాకుండా, మాస్ ఎంటర్‌టైనర్లతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఆయనకే చెల్లింది. మార్చి 25న జరిగిన ఈ వేడుకలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా బాలయ్య ఈ అవార్డును అందుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'భగవంత్ కేసరి' 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో 'ఉత్తమ తెలుగు చిత్రం'గా నిలిచి సంచలనం సృష్టించింది. కళారంగానికి బాలకృష్ణ చేసిన విశేష కృషిని గుర్తిస్తూ 2025లో భారత ప్రభుత్వం దేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మభూషణ్'తో గౌరవించింది. నటుడిగానే కాకుండా సేవా కార్యక్రమాలతో (బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి), రాజకీయ నాయకుడిగా కూడా బాలకృష్ణ తనదైన ముద్ర వేశారు.

## నేను సెలబ్రిటీని, నన్నెవడ్రా ఆపేది..
## మద్యం మత్తులో లావణ్య హంగామా!

సంగారెడ్డి జిల్లాలో మద్యం మత్తులో హీరో రాజ్ తరుణ్ మాజీ ప్రేయసి లావణ్య చేసిన హంగామా సంచలనంగా మారింది. బుధవారం కొండాపూర్ మండలం మల్లెపల్లి గ్రామం వద్ద జరిగిన ఘటనలో ఆమె కారుతో ఒక బైక్‌ను ఢీకొట్టడం, అనంతరం గ్రామస్థులతో వాగ్వాదానికి దిగడం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే లావణ్యపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు.

లావణ్య కారులో బీరు బాటిళ్లను పోలీసులు గుర్తించారు. ఆమెకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో 140 పాయింట్లు నమోదవ్వడంతో మద్యం సేవించి వాహనం నడిపినట్లు నిర్ధారణ అయింది. దీంతో కొండాపూర్ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి కారును సీజ్ చేసి కొండాపూర్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. గొడవ సమయంలో కారులో లావణ్యతో పాటు మరో వ్యక్తి కూడా ఉన్నారు. ఈ కేసులో భాగంగా ఈ రోజు కోర్టుకు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ.. లావణ్య గైర్హాజరయింది.

లావణ్య మల్లేపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఓ బైక్‌ను తన కారుతో ఢీకొట్టింది. ఆపై పారిపోయే ప్రయత్నం చేయగా.. గ్రామస్థులు అడ్డుకున్నారు. సారీ చెప్పాలని గ్రామస్థులు కోరగా.. వారితో లావణ్య వాగ్వాదానికి దిగింది. 'నేను ఎవరో తెలుసా?' అంటూ తిరిగింది. తాను సెలబ్రిటీనని, తనను ఆపే హక్కు ఎవరికీ లేదంటూ హెచ్చరించారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయ నాయకులతో తనకు పరిచయాలు ఉన్నాయని చెప్పి బెదిరింపులకు కూడా దిగింది. తన కారును అడ్డుకుంటే కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని లావణ్య గ్రామస్థులను భయపెట్టింది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.